# రాంపండూ - గాన కౌశలమూ



"మళ్లీ మళ్లీ పాడుతా, మల్లి మనసు నాదేననీ..."

అనంత్ బాత్‌రూమ్‌లో కూనిరాగం తీస్తూండగా అచలపతి పిలుపు వినబడింది.

"సర్, మీ స్నానం, పాట అయిపోతే బయటకు రావచ్చు. రాంపండుగారు మీ కోసం వెయిట్ చేస్తున్నారు."

అనంత్‌కి సమాధానం ఇవ్వక తప్పింది కాదు. "చూడు అచలపతీ, స్నానం అయిపోతే పాట ఆపేస్తానని తెలిసికూడా నువ్వలా అనడం బాగాలేదు. రాంపండు వచ్చాడంటున్నావు కాబట్టి త్వరగా స్నానం ముగించి వచ్చేస్తాను. ఉండమను."

అనంత్ చెప్పినది నిజమే. అనంత్ బాత్‌రూమ్ సింగరే కానీ బాల్‌రూమ్ సింగరు కాడు. పాట పూర్తిగా పాడేవరకూ స్నానం చేయాలని వాళ్ళ అమ్మ చిన్నప్పుడు నేర్పించింది. అనంత్‌కు ఏ పాటా - లిరిక్ గానీ, ట్యూన్ గానీ సరిగ్గా గుర్తుండవు. అవన్నీ గుర్తుకు తెచ్చుకుని పాట పూర్తి చేసేసరికి కాస్త ఎక్కువసేపు స్నానం చేయవలసి వస్తుంది. అదే వాళ్ల అమ్మ కోరుకున్నది కూడా. స్నానం అంటే రెండు చెంబుల నీళ్లు పోసుకుని పరిగెట్టుకురాకుండా ఆవిడ ఈ ఉపాయం కనిపెట్టింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశం అంతా ఊపేస్తున్న పాట కాబట్టి "మళ్లీ మళ్లీ పాడుతా..." అనంత్‌ను పట్టేసుకుని వదలనంటోంది.

స్నానం ముగించి అనంత్ వచ్చేసరికి రాంపండు బల్లమీద దరువులు వేస్తున్నాడు. పాట అదే - "మళ్లీ మళ్లీ పాడుతా, మల్లి మనసు నాదేనని.."

"ఏం గిరాకీ?"

"అనంతూ, నాకు పెళ్లి కుదిరింది." అన్నాడు రాంపండు ఉత్సాహంగా.

"తిక్క కుదిరింది.. వీణాపాణేనా.?"

రాంపండుకు కోపం వచ్చింది. "ఏమిట్రా ఆ వీణాపాణి తప్ప వేరే ఆడదే నాకు దొరకదా? ఫుట్‌పాల్ మ్యాచ్ వ్యవహారంలో మేనక చెయ్యివ్వడంతో ఒళ్లు మండి మళ్లీ వీణాపాణి దగ్గరకు వెళ్లాను. నాలుగురోజులు సవ్యంగా నడిచాయో లేదో, మళ్లీ పోట్లాటేసుకుంది. నేను బొత్తిగా అలుసయిపోయాననుకో.."

"అయితే ఇప్పుడీ పెళ్లి ఎవరితో కుదిరినట్టు? కొత్త కాండిడేటా?" అడిగాడు అనంత్ నిర్లక్ష్యంగా.

"ఒరే, అంత తీసిపారేసినట్టు మాట్లాడకురా. ఈ కోకిల చాలా మంచిది తెలుసా. అస్సలు అహంభావం లేదు. - సంగీత విభావరులు అవీ ఉంటాయి చూడు, వాటిల్లో పాటలు పాడుతూంటుంది. భలే వాయిస్‌లే. చక్కగా మిలమిల లాడే కళ్లూ, కమ్మటి.."

రాంపండు మామూలు ట్రాక్‌లో పడిపోతున్నాడని తెలిసి అనంత్ భయపడ్డాడు. రాంపండుని ఆపబోయేడు - "సరే, ఇప్పటిదాకా మూడు డజన్ల మంది అమ్మాయిలలో ఈ లక్షణాలు కనబడ్డాయి నీకు. ఇంతకీ పెళ్లి నిజంగా కుదిరినట్టేనా? లేక.."

"నువ్వు తలచుకుంటే కుదిరినట్టే." అన్నాడు రాంపండు లౌక్యంగా.

"మధ్యలో నేనెక్కణ్ణుంచి వచ్చాను?" అనంత్ తికమక పడ్డాడు.

రాంపండు వివరించాడు - కోకిలకు రాంపండు నచ్చాడట. కానీ చిన్న చిన్న అభ్యంతరాలున్నాయిట. కోకిల చాలా సీరియస్ మనిషట. ప్రాక్టికల్ జోక్స్ వేసేవాళ్లని అసహ్యించుకుంటుందిట. రాంపండు ప్రాక్టికల్ జోక్స్ వేస్తాడని ఎవరో చెప్పారట. పైగా 'ఫలానా ఊళ్లో ఫలానా రోజున అనంత్ తలకింద ఐసుదిండు పెట్టి ప్రాక్టికల్ జోక్ వేశాడు. కావాలంటే చెక్ చేసుకో'. అని కూడా చెప్పారట. అది నిజమో కాదో తెలుసుకుందామని అనంత్ ఇంటికి రాబోతోందట.

"ఒరేయ్, నా కథకు ముగింపు నీ చేతిలో ఉంది. నన్నో ఇంటివాణ్ని చేసి ఈ కథ ముగిస్తావో, ఇలా సాగదీస్తావో నువ్వే తేల్చుకోవాలి. ఆ ఐసుదిండు విషయం నిజమేనని

చెప్పావో నాకు శాశ్వతంగా టాటా చెప్పేస్తుంది. అందుకని అదంతా గిట్టని వాళ్లు పుట్టించిన కట్టు కథ అని చెప్పేయి. పెళ్లి చేయడానికి లభించే వెయ్యి అబద్ధాల కోటాలో తక్కిన తొమ్మిది వందల తొంభై తొమ్మిది దాచుకో. ఇవాళ మధ్యాహ్నం నీ ఆహ్వానం మీద మీ ఇంటికి వచ్చి భోజనం చేసేటప్పుడు కోకిల ఆ విషయం ప్రస్తావిస్తే పగలపడి నవ్వేయి. 'జనాలు భలేవాళ్లే, ఎలాటెలాటి కథలు పుట్టిస్తారో, అందునా అతి సీరియస్ మనిషైన రాంపండు మీదనా!?' అనే వ్యాఖ్య కూడా జోడించు." రాంపండు బతిమాలుకున్నాడు.

"ఈ భోజనానికి నేనెప్పుడు ఆహ్వానించా నుట?" మర్యాదగానే అడిగాడు అనంత్.

"నో ఫార్మాలిటీస్ మై డియర్. నేను అలాటివేవీ పెట్టుకోను. ఒంటి గంటన్నర కల్లా మేం ఇద్దరం వచ్చేస్తాం." హామీ ఇచ్చి రాంపండు పారిపోయాడు.

అనంత్ నిట్టూర్చి అచలపతి కేసి చూశాడు. "అచలపతీ, చూశావా విధివిలాసం! వీడి ప్రాక్టికల్ జోక్సుకి గురి కావడమే కాకుండా వీడు అతి గంభీరమైన మనిషనీ, సోక్రటీసుకి బాబనీ కాన్వాస్ చెయ్యాలట. పైగా వాడి ప్రియురాళ్లందరినీ పీకలదాకా మేపాలట. ఖర్మ!"

"జీవితమే అంత సర్!" అన్నాడు అచలపతి.

"నిజం. నిజం. కరెక్టుగా చెప్పావ్. అవునూ, ట్రేలో ఏమిటవి?"

"వేయించిన రొయ్యలు సర్."

అనంత్ ఫిలాసఫించాడు. "తరచి చూస్తే పాపం రొయ్యలక్కూడా వాటి రొయ్య కష్టాలుంటాయి. ఏమంటావ్?"

అచలపతి కాదనలేదు. "ఉండవచ్చు సర్."

"అంటే నా ఉద్దేశ్యం - ఇలా వేయించబడడమే కాకుండా తక్కిన, ఇతర కష్టాలు కూడా నన్నమాట"

"తక్కిన ఇతర కష్టాలా సర్..?"

"అవును, ఇతర తక్కిన కష్టాలు"

"ఓకే సర్. నాకు సెలవిప్పిస్తే లంచ్ ఏర్పాట్లు చేస్తాను." అనంత్ ఫిలసాఫికల్ మూడ్ చూసి అచలపతి పారిపోయాడు.

***

లంచ్ తర్వాత కోకిలను ఆటో ఎక్కించి రాంపండు లోపలకు పరిగెట్టుకు వచ్చాడు - 'నేను చెప్పినది నిజమే కదూ, ఆమె భూలోకం మీద నడయాడే గంధర్వ కన్య కదూ" అని అడిగి చూశాడు.

"తక్కిన విషయాల మాట ఎలాగున్నా పాట మాత్రం ఆదరగొట్టేసింది. చూరుమీదనుంచి పెచ్చులింకా ఊడిపడుతూనే ఉన్నాయి!"

"నీ జోకులకేం గానీ ఏమైతేనేం ఓ అబద్ధం చెప్పి నా పెళ్లి కాపాడావు. ఋణం ఉంచుకోను. నువ్వు పెళ్లి చేసుకుందామనుకున్నప్పుడు చెప్పు. నువ్వు తెలివైనవాడివని అబద్ధం చెప్పి నిన్నూ ఓ ఇంటివాణ్ని.." అంటూ రాంపండు టేబుల్ మీద ఉన్న గ్లాసులోంచి విస్కీ ఓ గుక్క నోట్లో పోసుకున్నాడు.

"అదేమిట్రా, ఇందాకా ఆ అమ్మాయి ఎదురుగుండా విస్కీ వద్దనేశావ్!"

"అవును, విస్కీ తాగడం గురించి ఆ అమ్మాయి అభిప్రాయాలు పూర్తిగా తెలియకుండా రిస్కు తీసుకోలేం కదా. ప్రస్తుతం తనని ఇంప్రెస్ చేసే ప్రాసెస్‌లో ఓ ప్లాను వేశాను. మన

గుర్నాథం గాడి పాటల ప్రోగ్రాంలో తనచేత పాడిస్తున్నాను. ఈ లోపున ఇంప్రెషన్ పాడుచేసుకోవడం ఎందుకు? గుర్నాథం గాడి ప్రోగ్రాం సంగతి విన్నావుగా?"

వినకపోవడమేం? తను చేపట్టిన సాంఘికసేవా కార్యక్రమాల గురించి గుర్నాథం అనంత్ క్కూడా చెప్పాడు. ఊళ్లో వాడుండే లొకాలిటీలో ఉన్నవాళ్లందరూ కూలీనాలీ చేసుకునే మొరటు మనుష్యులే. కూరలమ్మే వాళ్లల్లోనూ, చేపలమ్మేవాళ్లలోనూ, మాంసం కొట్టేవాళ్లలోనూ కూడా కళాహృదయం ఉందని నిరూపించడానికి గుర్నాథం ఓ క్లబ్బుపెట్టి పుస్తకాలిచ్చి చదవమనడం, శాస్త్రీయ సంగీతం లాటివి వినమనడం చేస్తున్నాడు. స్కూలుకు వెళ్లేందుకు మొరాయించే పిల్లల్లా వాళ్లు కాస్సేపు మారాం చేసినా చివరికి గుర్నాథం మాట కొట్టేయలేక ఆ కార్యక్రమాలకు హాజరయి, తామూ సంస్కారం నేర్చుకున్నామని అతనికి ధైర్యం చెబుతూ ఉంటారు. ఆ కార్యక్రమాలకు గుర్నాథం అనంత్ దగ్గర అప్పుడప్పుడు విరాళాలు వసూలు చేస్తూ ఉంటాడు కూడా. వారం రోజుల తర్వాత జరగపోయే ప్రోగ్రాంలో కోకిల చేత ఓ పాట పాడిస్తాడట. అంతకంటె దారుణం - తను కూడా ఓ పాట పాడతాడట! 'మధ్యలో అదెందుకురా?' అనడిగాడు అనంత్.

"నీకు తెలియదులే. నేను పాడబోయే పాట వింటే నా హృదయంలో చాలా లోతులూ, లోయలూ ఉన్నాయని తెలుస్తుందన్న మాట. వాటి గురించి కోకిలకు ఇంకా ఏమీ తెలియదు. అటువంటివి వున్నాయని అనుమానం కూడా లేదు తనకి ఇప్పటిదాకా. కానీ నా పాట విన్నాక ఆ స్థానిక రౌడీలందరూ కరిగి, కళ్లు తుడుచుకుంటూ ఉంటే అప్పుడు తెలిసొస్తుంది ఆమెకి - ' ఈ రాంపండు గాడికి చాలా ఉదాత్తమైన భావాలు, లోతైన అనుభూతులు ఉన్నాయి' అని ఆ పాట కూడా నువ్వు పాడే జులాయి, ఆకతాయి పాటల్లాటిది కాదు. చాలా భావగర్భితమైన భావగీతం లాటిది. నీవు విన్నావో, లేదో?"

అనంత్ కెవ్వుమన్నాడు. "కొంపదీసి నువ్వు 'మళ్లీ మళ్లీ పాడుతా, మల్లి మనసు..' పాడటం లేదు కదా!

"కొంపదీయటం లేదు. ఖచ్చితంగా అదే పాట పాడుతున్నాను." అనంత్‌కు కూడా ఖచ్చితమైన అభిప్రాయం ఉంది - అలాటి పాట రాంపండు లాటివాళ్లు పాడకూడదని. అంటే తనలాటి వాళ్లు పాడవచ్చని కాదు. అయినా తనూ పాడవలసి వచ్చింది. ఆ సందర్భం ఇలా వచ్చింది-

రాంపండు వెళ్లిన కాసేపటికి మాంకాళి అత్తయ్య వచ్చింది. వీణాపాణి తల్లి తన ఫ్రెండు. రాంపండు వీణాపాణిని వదిలేసి ఇంకోదాని వెంట పడుతున్నాడని విని వాడికి బుద్ధి చెబుదామని వచ్చింది. కాస్సేపటి క్రితమే రాంపండుకి అనంత్ లంచ్ ఇచ్చాడని విని మండిపడింది.

"వాడి సూప్‌లో ఇంత విషం కలపాల్సింది నువ్వు." అంది కసిగా.

"వాడు సూప్ తీసుకోలేదులే. ఆ కోకిల కళ్లలోని అమృతాన్ని జుర్రేస్తూ తన దాహాన్ని తీర్చుకున్నాడు. వదిలేయ్. ఇదిగో అచలపతీ, అత్తయ్య సమస్య విన్నావు కదా. రాంపండుని, కోకిలను విడగొట్టే ఉపాయం ఏదైనా చెప్పు." అన్నాడు అనంత్.

అచలపతి తలవూపాడు. "మేడమ్, ఉదహరించబడిన పరిస్థితులలో, మొట్టమొదటిగా మనం పరిగణనలోకి తీసుకోవలసినది ఆ వ్యక్తి యొక్క మనోవిశ్లేషణ."

"వ్యక్తి యొక్క ... ఏమిటది?" అంది మాంకాళి అత్తయ్య కంగారుపడి.

"మనోవిశ్లేషణ" అచలపతి జవాబు.

అనంత్ కలగజేసుకున్నాడు. "అర్థం కాలేదా అత్తయ్యా, మనోవిశ్లేషణ అన్నమాట! అవునూ, అచలపతీ, ఈ మనోవిశ్లేషణ అంటే అర్థం ఏమిటోయ్?"

"అంటే పరిశీలనలలో ఉన్న వ్యక్తుల యొక్క నైసర్గిక స్వభావము, మానసిక స్థితి అన్నమాట సర్"

"అంటే వాళ్ల తత్త్వం అన్నమాట"

"అలా కూడా అనచ్చండి."

అత్తయ్య ఇద్దరికేసి అదోలా చూసింది. "ఒరే అనంతూ, మీరిద్దరూ మాత్రమే ఉన్నప్పుడు కూడా అతనిలాగే మాట్లాడతాడా?" అని అడిగింది.

"ఒక్కోసారి. ఒక్కోసారి ఇలా మాట్లాడడు కూడా. అంటే కొన్ని సార్లు మామూలుగా మాట్లాడతాడు. కొన్నిసార్లు మామూలుగా మాట్లాడడు అన్నమాట. అర్థమయ్యింది కదూ. అచలపతీ, నువ్వు ముందుకు సాగిపో!"

"సరే సర్, కోకిల మేడమ్ నా పరిశీలనలో ఉన్న సమయంలో నాపై గాఢంగా వేసిన ముద్ర ఏమిటంటే – ఆమెది కఠినమైన స్వభావం. తప్పులు క్షమించలేని తత్త్వం. నా మనోఫలకంలో రూపుదిద్దుకున్న ఆమె వ్యక్తిత్వం విజయాన్ని హర్షించగలదు కానీ అపజయాన్ని సహించలేదు బహుశా మీరూ గమనించేవుంటారు – రాంపండు సార్ తన ప్లేట్‌లోంచి ఫోర్క్‌తో ఆమె ప్లేటులోకి నూడుల్స్ కిందపడకుండా వేయబోయి రెండుసార్లు విఫలమయినప్పుడు ఆమె చూసిన చూపు!"

"ఓ గుర్తుంది! రాంపండు గాణ్ని విదిలించి పారేసింది. మీకు చేతకాకపోతే నాకివ్వండి గానీ కిందామీదా పొయ్యవద్దు అంది కూడా."

"సరిగ్గా వర్ణించారు సర్."

మధ్యలో అత్తయ్య కలగజేసుకుంది. "ఆగండాగండి. నా కర్థమయినంత వరకూ మీ ఇద్దరూ కలిసి మాట్లాడుకొన్నదాని భావమేమిటంటే రాంపండు కోకిల ప్లేటులోకి నూడుల్స్ వేయడానికి ప్రయత్నిస్తూ పోతే, చివరికి ఆమెకి ప్రాణం విసిగి 'నాకూ నూడిల్సూ వద్దు, నువ్వూ వద్దు వెళ్లిరా నాయనా' అంటుంది. అంతేనా?"

"మేడమ్, కోకిల గారి దయారాహిత్యానికి ఓ చిన్న ఉదాహరణగా మాత్రమే నూడిల్స్ ఉదంతం చెప్పాను కానీ.." అని అచలపతి అంటూండగానే అనంత్ ఎగిరి గంతేశాడు. "దయారాహిత్యం! అబ్బ ఇందాకటినుంచీ అదే మాట గురించి వెతుక్కుంటున్నానయ్యా! భలే చెప్పావు సుమా!"

అత్తయ్య అనంత్‌కేసి కోరగా చూస్తూ ఉండగానే అచలపతి తన ఐడియా వివరించాడు – 'సర్, రాంపండు గారు పదిమంది ఎదుట అపహాస్యం పాలయితే, అది కోకిల మేడమ్ కంటపడితే ఆమెకు ఆయనపై గల అభిమానం ఫ్లాష్‌బ్యాక్ అయిపోతుంది. ఉదాహరణకి మంగళవారం నాటి సాయంత్రం గుర్నాథం ఫంక్షన్‌లో రాంపండు ప్రేక్షకులను మెప్పించలేకపోతే.."

అనంత్‌కి జ్ఞానోదయం అయింది. "అంటే జనాలు వాణ్ని మోసేస్తే వాడి ప్రేమాయణం అంతటితో సరి అంటావ్."

"అలా జరక్కపోతేనే ఆశ్చర్యపడాలి సర్."

అనంత్ కాస్త ఆలోచించాడు. "రాంపండు గాడు సరిగ్గా పాట పాడలేక కంపు కొట్టిస్తాడనుకో. కానీ ఆ బండవెధవలకి వాడి పాట నచ్చి చప్పట్లు కొడితే..? ఛాన్సు తీసుకోకూడదు."

"సర్, మనం అదృష్టాన్నే నమ్ముకుని కూచోనక్కరలేదు. గుర్నాధానికి చెప్పి రాంపండు పాటకు ముందు "మళ్లీ మళ్లీ పాడుతా" పాటను మీరు పాడేశారనుకోండి. రాంపండు పాట ఆరంభించే సమయానికి ఆ పాట మీద సభికులకు మోజు పోయి వాళ్ల అభిప్రాయాలను కాస్త ఘాటుగా వ్యక్తం చేసే అవకాశం ఉంది."

అత్తయ్య వెంటనే అరిచింది. "నీ బుర్ర అమోఘమోయ్, అచలపతీ" అని. అనంతూ అరిచాడు - "నీకు మతిపోయిందోయ్, పోయి పోయి నేను స్టేజిమీద పాట పాడడమేమిటి?" అని.

కానీ అత్తయ్య మాట వినిపించుకోలేదు. "అనంతూ, నువ్వు పాడబోతున్నావ్. లేకపోతే నేను శాపం ఇస్తానంతే!" అనేసింది. గుర్నాధానికి ఫోన్ చేయడం, అరగంటలోగా ప్రోగ్రాం ఫిక్స్ అయిపోవడం జరిగింది. మంగళవారం నాటి ప్రోగ్రాంలో ఇంటర్వెల్ తర్వాత అనంత్‌పాట, తర్వాత రాంపండుది. ఆ తర్వాత ప్రఖ్యాత గాయని కోకిల పాట!

***

మంగళవారం హాలు దగ్గరికి చేరేసరికి అన్నిటికీ తెగించే వచ్చాననుకున్న అనంత్ కూడా ఖంగు తిన్నాడు. సంగీతామృతంలో ఓలలాడడానికి అక్కడ చేరిన రసికశిఖామణుల పెర్సనాలిటీలు చూడగానే టాక్సీ పట్టుకుని వెనక్కి పారిపోయి నాగరీకుల మధ్య పడదామనిపించింది. నిప్పులో దూకే శలభం ఫీలింగు కలుగుతూండగానే - "హాలు బాగా నిండింది కదా సార్" అంది అతని మోచేయి.

తిరిగి చూస్తే అచలపతి. "నువ్వు ప్రోగ్రాం మొదటినుండీ ఉన్నట్టున్నావు - ఎవణ్నైనా మోసేశారా?" అని అడిగాడు.

"ఇంకా ఎవర్నీ.. లేదు సార్."

"అంటే నాతోనే ఆరంభమవుతుందన్నమాట"

"అబ్బే, అదేం కాదండి."

అనంత్‌కు కోపం వచ్చింది - "నీ ప్లాను ప్రకారం అంతా జరుగుతుందనుకుంటున్నావేమో! దాంట్లో ఓ పెద్ద లొసుగు ఉంది తెలుసా?"

"లొసుగా?"

"అవును. గట్టిగా మాట్లాడితే లొసుగున్నర! నేను పాడడం విన్నాక రాంపండు ఆ పాటే ఎందుకు పాడతాడు? పబ్లిక్‌మూడ్ గమనించి రంగం విడిచి పారిపోతాడు."

"రాంపండు గారికి మీ పాట గురించి తెలియడానికి అవకాశం లేదు సర్. నా సలహామేరకు ఆయన రోడ్డుకు అటుసైడున్న బార్‌లో కాస్త మందు పుచ్చుకుంటున్నారు. ఈ ప్రోగ్రాంలో ఆయన వంతు రాగానే నేను వెళ్లి చెప్పివస్తాను." అన్నాడు అచలపతి.

"ఓహో, ఇదో ఏర్పాటా?"

"అవునుసార్, మీరేమనుకోకపోతే, రోడ్డుకు ఇటుసైడున్న బార్‌లో మీరూ అదే పని చేయవచ్చు. స్టేజీ ఎక్కబోయేముందు కలిగే నెర్వస్‌నెస్ పారద్రోలడానికి..."

అచలపతి చెప్పిన విస్కీ చికిత్స అద్భుతంగా పనిచేసింది. ప్రపంచం యెడల అనంత్ దృక్పథాన్ని మార్చివేసింది. మోకాళ్లు పట్టుదప్పడం మానేశాయి. చేతులు వణకడం మానేసాయి. నాలుక ఫ్రీగా ఆడటం మొదలు పెట్టింది. వెన్నెముక దన్నుగా నిలిచింది. లోకంలో ఎటువంటి గూండా ఆడియన్స్‌నైనా ఎదుర్కోవడానికి ధైర్యం వచ్చింది. కాస్సేపట్లో అనంత్ స్టేజిమీద, ఓ లక్షకళ్లు అతని మీద. దేవుడి మీద భారం వేసి, గట్టిగా ఊపిరి పీల్చి, "మళ్లీ మళ్లీ పాడుతా.." పాట అందుకున్నాడు.

తరువాత ఏమయిందో అనంత్‌కు అంత స్పష్టంగా గుర్తులేదు. అంతా అలుక్కుపోయిన ఫీలింగ్. ఏదో గొణుగుడు, ఏదో సణుగుడు మాత్రం పాడుతున్నంతసేపూ వినబడింది. ప్రేక్షకశ్రోతలు అత్యుత్సాహంతో అతని పాటను బృందగానంగా మారుద్దామనుకున్నట్టు అనిపించిందతనికి. ఆ ఊపుతో ఒంట్లో శక్తినంతా గొంతులోకి తెచ్చుకుని అలా, అలా తారస్థాయికి వెళ్లి అలా పాడుతూనే తెర పక్కకి తప్పుకున్నాడు. పాట అయిపోయాక వంగి నమస్కారాలు పెట్టి, ప్రేక్షకుల అభినందనాలు స్వీకరించే ఉద్దేశ్యం ఎంతమాత్రం లేదతనికి. ఏమో, తన వీపు చూస్తే ఏ తుంటరికి ఏం బుద్ధి పుడుతుందో! అని అతని భయం.

స్టేజి దిగి అచలపతి వద్దకు రాగానే డిక్లేర్ చేసేశాడు – "ఇక నేను జన్మలో స్టేజి ఎక్కడం జరగదు. ఇకమీద ఎవరైనా నా పాట వినాలనుకుంటే నా బాత్‌రూమ్ బయట నిలబడి చెవి తలుపు కాన్చాల్సిందే! ఇవాళ కూడా పాట చివరికి వచ్చేసరికి శ్రోతలు కాస్త చికాకు పడుతున్నట్లు అనిపించిందెందుకో. బహుశా నా భ్రమోనేమో – మోసేయడానికి బోయీలు 'బొహోం, బొహోం' అంటున్న ఫీలింగు కలిగింది. అంతా వట్టి ఊహే కదూ!"

"ప్రేక్షకులు అంత సంతోషంగా లేనట్టు నాకూ అనిపించింది సర్. అదెంత గొప్పపాటైనా జనాలకి మొహం మొత్తినట్టనిపించింది నాకు."

"అదేమిటి?"

"నేను ముందే చెప్పి వుండాల్సింది సర్. ఆ పాట అప్పటికే మీరొచ్చేముందు ఓ ఇద్దరు పాడారండి."

"అమ్మనాయనోయ్.."

"..ఒక అమ్మాయి. ఒక అబ్బాయి. ఒకరి తర్వాత ఒకరు. అది చాలా ప్రజాదరణ పొందిన గీతం కదా సర్." అనంత్ అచలపతికేసి నోరు తెరిచి చూస్తూ ఉండిపోయేడు. అన్నీ తెలిసి తన యజమానిని మొసళ్లకు ఆహారంగా వేయడానికి కూడా వెనకాడని మనిషన్నమాట! ప్రభుభక్తి లాటి మాటలు రాజుల కాలంలోనే అంతరించాయా? అని అనుకుంటూండగానే రాంపండు స్టేజెక్కడం కనబడింది. బార్ నుండి వచ్చిన రాంపండు బార్ నుండి వచ్చినట్టే ఉన్నాడు. ఆడియన్స్‌లో వాడి ఫ్రెండ్స్ ఉన్నారేమో చప్పట్లు కొట్టి కేకలు వేశారు. రాంపండు మొహం ఇంతయింది. అయి, అయి తలకాయ వెనకభాగం తగ్గిపోయేటంతయింది. ఆనందంతో తేలిపోతున్న మనిషి నేలమీద ఎంత బాగా నిలబడగలడో అంత బాగా నిలబడి, తన ప్రజలనుండి వందనాలు, అభివందనలు స్వీకరించే రాజుగారి స్టయిల్లో చేతులూపాడు. ఆర్కెస్ట్రా వాళ్లకు ఏ పాట వాయించాలో చెబుతూండగానే వాళ్లూ తెల్లబోయారు. కానీ అదేమీ పట్టించుకోకుండా రాంపండు బెలూన్లా ఉబ్బి, చేతులు జోడించి, కళ్లు గిరగిరా పైకి తిప్పి వాసాలకేసి చూసి పాట లంకించుకున్నాడు. 'మళ్లీ మళ్లీ పాడతాను, మల్లి మనసు నాదేనని.."

హాల్లో ఉన్న జనాలకి రిమ్మ తిరిగి పోయుంటుంది. వాళ్లు ఏం చెయ్యాలో ఒక నిర్ణయానికి రావడానికి కాస్త టైము పట్టింది. మొత్తమంతా అయిన తర్వాత గుర్తు చేసుకుంటే అనంత్‌కు ఒక విషయం మాత్రం బాగా నాటుకుపోయింది - రాంపండు పల్లవి పూర్తి చేసేదాకా సభలో కలకలం కూడా లేదు. ఆ తర్వాతే ప్రజల్లో చైతన్యం రగిలింది. 'జనంలో చైతన్యం రావాలి. రావాలి' అంటాం గానీ అది వస్తే ఎలా ఉంటుందో మనం ఊహించలేం. అవాళ అనంత్‌కి అది చూసే సందర్భం పడింది. ఫ్రెంచి విప్లవం ఎలా జరిగి ఉంటుందో ఓ అయిడియా వచ్చిందతనికి. కుస్తీపోటీల్లో రిఫరీ అన్యాయం చేసినప్పుడు ప్రేక్షకులు చేసే శబ్దం లాటిది హాలు అన్ని మూలలనుండీ బయలుదేరి హాలంతా వ్యాపించింది. ఆ తర్వాత మాటలతో సరిపెట్టకుండా కార్యక్రమంలో కూరగాయల అంశం కూడా ప్రవేశపెట్టారు కొంతమంది.

మనసు గారడీలు చేస్తూంటుంది. ఎందుకో తెలియదు కానీ రాంపండు మీద మొదటపడింది బంగాళాదుంప అనే ఒక ఊహ అనంత్ మనస్సులో తిష్ఠవేసుకుని ఉండిపోయింది. నిజానికి మొదట పడినది అరటిపండు! అరటిపండు విసిరిన తీరు చూస్తే, నచ్చని కళాకారుణ్ని ఎలా సత్కరించాలో, ఏ కూరగాయ ఎటువంటి శక్తి కలిగి ఉంటుందో తెలిసి చిన్నప్పటి నుండీ బాగా తర్ఫీదు పొందిన వాళ్లనిపించింది అనంత్‌కి. ఆ అరటిపండు రాంపండు చొక్కామీద పడగానే బంగాళాదుంప కంటె అది ఎంత కళాత్మకమైనదో అనంత్‌కి తెలిసివచ్చింది. అంతమాత్రాన బంగాళాదుంప భక్తులను తక్కువగా అంచనా వేయడానికి లేదు. బంగాళా దుంప విసిరేవాళ్లలోనూ అతనికి కళాభిరుచిగల ముఖాలు కనబడ్డాయి.

రాంపండు మీద దీని ప్రభావం చెప్పుకోదగ్గది. కళ్లు ఉబ్బాయి. జుట్టు నిలబడింది. అయినా నోరుమాత్రం తెరుచుకుంటూ, మూతబడుతూ దానంతట అదే పాటపాడుతూ పోయింది. హఠాత్తుగా స్పృహలోకి వచ్చి పక్కకు పారిపోయే టప్పుడు మాత్రం ఫుట్‌బాల్‌కి 'హెడ్' ఇచ్చినట్టు ఓ పెద్ద బంగాళాదుంపకు హెడ్డిచ్చి వెళ్లిపోయాడు.

జనం చల్లబడ్డాక అనంత్ అన్నాడు - "అచలపతీ, రాంపండు గురించి బాధపడకు. ఆపరేషన్ చేసేటప్పుడు కత్తి ఉపయోగించడానికి వెరవకూడదు. ఇది తన స్వంత కళ్లతో చూశాక కోకిల 'రాంపండూ, నీకూ నాకూ రాంరాం' అని ఉత్తరం రాయకపోతే నన్నడుగు.'

అచలపతి ఔనని సమాధానం చెపుతూండగానే గుర్నాథం స్టేజీమీదకు వచ్చాడు. "ప్రేక్షకులు మన్నించాలి. తర్వాత పాడవలసిన కోకిల గారు దారిలో కారు చెడిపోవడం వలన కాస్త ఆలస్యంగా వస్తానని ఇప్పుడే ఫోన్ చేశారు. ఈ లోపున మన మిత్రుడు సూరిబాబు.."

అనంత్ పడిపోబోయి అచలపతి భుజం పట్టుకుని తమాయించుకున్నాడు. "విన్నావా, ఆ అమ్మాయి రానే లేదుట. నేను ప్రాణాలకు తెగించి చేసిన త్యాగం వేస్టయిపోయింది. రాంపండు పరాభవం ఆమె కంటబడనే లేదు. ఇక అత్తయ్యకు మొహం ఎలా చూపించగలను? ఇంకోసారి బార్‌కు వెళ్లి అక్కణ్నుంచి ఇంటికి వెళ్లిపోతాను. కావాలంటే నువ్వు తర్వాత రా." అని వెళ్లిపోయాడు.

***

రాత్రి పదిన్నర అయివుంటుంది. రాంపండు వచ్చాడు. మృత్యుముఖంలోంచి తప్పించుకుని వచ్చినట్టున్నాడు. ఎడం కన్ను 'వాయనా? వద్దా?' అని ఆలోచిస్తోంది.

"గుర్నాథం ప్రోగ్రాంకు నువ్వు వచ్చినట్టు లేదే! నేను పాటపాడి వచ్చాను. అదిరిపోయింది. పాట విని ఎవరూ తేరుకోలేకపోయారు. కంటతడి పెట్టనివారు లేరనుకో" అన్నాడు.

'హోరి అబద్దాల కోరా!' అనుకుని "ఇంతకీ మీ కోకిల ఏమందేమిటి?" అన్నాడు అనంత్.

"చాలా సంతోషించిందనుకో. కానీ ఆలోచించి చూస్తే తనకీ, నాకూ కొన్ని విషయాల్లో పొత్తు కుదరదేమో ననిపిస్తోంది. వీణాపాణియే బెటరనిపిస్తోంది. రేపే వాళ్ల ఊరు వెళ్లాలి. నీ దగ్గర కాస్త చిల్లరేమైనా ఉంటే..?" అన్నాడు రాంపండు.

'హమ్మయ్య, అత్తయ్య దగ్గర మాట దక్కితే చిల్లరేమిటి? నోట్లే ఇస్తాననుకుంటూ అనంత్ డబ్బు ఇవ్వడం, క్షణంలో రాంపండు మాయం కావడం, ఆ తర్వాత ఐదు నిమిషాలకు అచలపతి ఇంటికి తిరిగిరావడం చకచక జరిగాయి.

"అచలపతీ విన్నావా? రాంపండుకి, కోకిలకు చెడిందట!.. అదేమిటి? నువ్వు ఆశ్చర్యపడినట్టు లేదే!" అన్నాడు అనంత్.

"కోకిల మేడమ్ రాంపండు గారి ఎడమ చెంప వాయగొట్టినప్పుడే అలాటిదేదో జరుగుతుందనిపించింది సర్"

"కొట్టడమా? ఆమెకేం వచ్చింది?"

"తన పాటకు జనం ప్రతిస్పందించిన విధానం వల్ల ఆవిడ మనసు చెదిరినట్లయింది సర్."

"చచ్చాం పో, కొంపదీసి జనాలు ఆమెను కూడా మోసేయలేదు కదా!?"

"అలాటిదే జరిగింది సార్."

"అదేమిటయ్యా, తనది బ్రహ్మాండమైన వాయిస్ అయితేనూ."

"కరెక్టేనండి. కానీ ఆమె ఎన్నుకున్న పాట ప్రజలకు నచ్చలేదు లాగుంది."

అనంత్‌కు అనుమానం వచ్చింది. "కొంపదీసి.. కోకిల కూడా 'మళ్లీ మళ్లీ పాడుతాను..' పాట పాడలేదు కదా!"

"ఎస్‌సర్, అదే పాట పాడారు. అంతే కాకుండా, అదేమిటో గానీ, ఓ పెద్ద టెడ్డీబేర్ స్టేజిమీదకు తెచ్చి దాన్ని ఉద్దేశించి మరీ పాడారు. జనం ఆ బొమ్మ చూసి మిమిక్రీ చేస్తారని ఆశపెట్టుకున్నారు లాగుంది. మళ్లీ 'మళ్లీ మళ్లీ' పాట పాడడం వారిని మండించినట్టుంది."

"ఇకచాలు బాబూ, నాకు అర్థం అయి పోయింది. జనం ఎలా రియాక్ట్ అయివుంటారో నేనూహించగలను. విధివిలాసం కాకపోతే తను కూడా ఇదే పాట ఎంచుకోవడం ఏమిటి చెప్పు." అని వాపోయాడు అనంత్.

"ఈ విషయంలో విధికి తక్కువ పాత్రే ఉందండి. నేను కాస్త చొరవ తీసుకోవలసి వచ్చింది. కోకిలమేడమ్ కారులోంచి దిగగానే రాంపండు గారు ఈ పాటే పాడమని తన రిక్వెస్టుగా చెప్పమన్నారని చెప్పానండి. రాంపండు గారు ఆ టైములో బార్‌లో సెకండ్ రౌండ్‌కి వెళ్లివున్నారండి. ప్రేక్షకుల గొడవ భరించలేక కోకిల మేడమ్ పాట మధ్యలో ఆపి వచ్చేసరికి రాంపండు గారు ఎదురుగా కనబడ్డారండి. ఆవిణ్ని చూసి పలకరింపుగా నవ్వారండి. దాంతో ఇది రాంపండు గారు చేసిన ప్రాక్టికల్‌జోక్ అని ఆవిడ భావించి, ఎడమ చెంపమీద.. ఈ సమాచారం చాలా సర్?" అన్నాడు అచలపతి.

"ఇక చెప్పనక్కరలేదు మహాప్రభో చాలు. ఏమైతేనేం మా అత్తయ్య శాపం బారినుండి నన్ను రక్షించావ్. చాలు గుడ్‌నైట్' అన్నాడు అనంత్ ఆనందంగా.

